# ఫేస్ వాల్యూ

కొంతమంది వాళ్ళ వాళ్ళ ముఖారవిందాలపై గొప్ప నమ్మకం వుంటుంది. తమలాంటి కళ గల ముఖం ఇరవై ఒక్క జిల్లాల్లో ఎంత వెతికినా కన్పించదు అని గట్టిగా అనుకుంటారు.

అలాంటి వాళ్ళలో మా కృష్ణమూర్తి ఒకడు.

అసలు ఏదైనా గాని పని జరగటానికి, జరగ పోవటానికి గాని వాళ్ళ వాళ్ళ ముఖారా విందాలే కారణమని మా వాడి సిద్ధాంతం. ' నగుమోము కనలేని ....' అని త్యాగరాజు వ్రాసినా ' వెధవముచ్చు మొహం నువ్వూనూ ' అని ఎవరైనా కూకలేసినా వాటిక్కారణం ముఖమే కదా అంటాడు వాడు. అసలు తెల్ల వాడు మొహం చూసి మనిషి స్వభావం చెప్పవచ్చనలేదా, అందాకా ఎందుకు మనవాళ్ళు మొహంచూసే కదా భవిష్యత్తు చెపుతున్నారు అని కూడా వాదిస్తాడు.

వాడు చదువు పూర్తి చేసి మొదటి సారిగా ఇంటర్వ్యూ కెడుతున్నపుడు ఆధారపడింది తెచ్చుకున్న డిగ్రీ పైన కాదు తన ఆ ఫేస్ వాల్యూ పైనే – అద్దంలో చంద్రబింబలాంటి తన ముఖాన్ని అనేకసార్లు చూసుకుని, దానికి అనేకానేక రంగులు హంగులు అమర్చి, చాలా ధైర్యంగా ఆశగా వెళ్ళాడు.

ఇంటర్వ్యూ కొచ్చిన వాళ్ళెవ్వరికీ తనలాంటి ఫ్యాన్సీ ఫేస్ లేనందుకు ముందు సంతోషపడి, ఆ పైన గర్వ పడ్డాడు. ఇంటర్వ్యూలో వాళ్ళడిగిని అసందర్భపు పుచ్చు ప్రశ్నలన్నింటికి చిరునవ్వుతో బదులిచ్చాడు.

ఫస్ట్‌క్లాస్ డిగ్రీ వుంది, ఇంటర్వ్యూ అదర గొట్టేడు. అన్నిటికి మించిన ఫేస్‌వాల్యూ వుంది.

మరి వుద్యోగం రాక ఏమౌతుందని ధైర్యంగా వున్నాడు.

కాని, ఆ వుద్యోగం అతడి దాకా రాలేదు.

అది జిడ్డుమొహం జంగయ్యకి దక్కింది.

ఆ జంగయ్యకి థర్డు క్లాసు డిగ్రీ వుంది. జిడ్డు కారే మొహం వుంది. వేలకి వేలు లంచాలు పెట్టగల తండ్రి అండగా వున్నాడు. ఇంకా చెప్పాలంటే, ఫోన్ చేసి బేరాలు

కుదిర్చి పన్లు చేయగల సమర్థుడయిన ఎం.ఎల్.ఎ.బంధువున్నాడు.

ఇవన్నీ తెల్సుగనుకనే జంగయ్య ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకి బదుల్వీక చిరునవ్వు నవ్విబయట కొచ్చాడు.

ఈ విషయాన్ని పూసగుచ్చినట్లుగా క్రిష్ణమూర్తికి చెప్పినా అతడొప్పుకోడు. జంగయ్య మొహం జిడ్డు కారుతున్నా మన కర్థంకాని అర్థం తెలీని వాల్యూ ఏదో వుండి వుండాలంటాడు. అసలు జంగయ్య ఫేస్‌వాల్యూపై రీసెర్చి చేస్తానంటున్నాడు !

------- అయ్యిపోయింది -------